# పుష్కరిణి

[కథానిక]

గోవిందబాబాయ్ చెప్తున్నాడు.

విశాలక్ష్మి వింటున్నది...

లక్ష్మీ పోదామా? అన్నాడు గోవింద బాబాయ్.

తప్పకుండా పోవాలి బాబాయ్ అన్నది లక్ష్మి.

'చాలాకష్టం...టిక్కెట్లు దొరికే విషయం అట్లావుంచి—అసలుపోతే చాలా బాధలు పడాలి, అమ్మాయీ అయినా ప్రయత్నంచేద్దాం' అన్నాడు గోవిందరామశాస్త్రి.

పుష్కరానికివెళ్తే జన్మ తరిస్తుంది బాబాయ్ అంది లక్ష్మి. తప్పకుండా వెళ్లాలి. ఈ యేడు కృష్ణమ్మతల్లి బాగావచ్చింది అన్నది.

గోవిందరామశాస్త్రి కొంచెంసేపు నిశ్శబ్దంగా కూచున్నాడు. అయిదునిమిషాములు యేమీ మాట్లాడలేదు.

లక్ష్మికి కొంచెం భయంవేసింది. బాబాయ్ కొంచెంసేపు మాట్లాడకుండా వున్నాడంటే యేదో విశేషంవుంటుంది. జీవితంలో అడుగు పెట్టినప్పటి నుండీ బాబాయ్ ప్రవర్తన చూస్తూనేవుంది.

గోవిందరామ్‌బాబాయ్‌ని అడిగేంత ధైర్యం లేకపోయింది లక్ష్మికి.

విశేషం యేమయివుంటుంది అని అనుకున్నది. తను మాట్లాడినమాటలు బాబాయ్‌కి యేమన్నా కష్టంకలిగించాయేమో అని కొంచెం జంకపడ్డది లక్ష్మి.

ఏంచేద్దాం బాబాయ్...పుష్కరం విషయం. నీవుచెప్పినట్లు చేస్తాను—అన్నది లక్ష్మి అమాయకంగా దీనత్వం ఉట్టిపడేటట్టు. ఈమాటకు బాబాయ్ యేమంటాడో అని.

గోవిందరామశాస్త్రి సన్నగా చీది...మొగం అటువైపు తిప్పి బరువుగా నిశ్వాస...చేశాడు.

లక్ష్మికి విపరీతమైన భయంపుట్టింది. గజగజ వణికిపోయింది. బాబాయ్ యీవిధంగా యెందుకు వున్నాడో గ్రహించుకోలేకపోయింది. గోవిందరామ్ బాబాయ్ యెప్పుడు యీవిధంగా వుండలేదు. లక్ష్మికి ఆశ్చర్యంవేసింది. ఏవిధంగానూ నిర్ధారణకురాలేక మెదలకుండా వెళ్ళి వంటయింట్లోకూచుంది. అప్పుడే బజారునుండి తెచ్చిన వంకాయలు తరగటం మొదలెట్టింది. మనసంతా బాబాయ్‌మీద వుంది. బాబాయ్‌కి వున్నట్టుండి మనసుకు కష్టంవేసింది. కారణం యేమైవుండాలి?

ఏమీతోచలేదు. బాబాయ్‌కి చాలా యిష్టమైన పదార్థం...దోసకాయ ముక్కలుతరిగి పులుసు పెట్టింది. చిన్నచిన్న విషయాలకుకూడా ఖేదపడటం లక్ష్మికి అలవాటు.

గోవిందరామ్‌బాబాయ్ భోజనంచేశాడు. చేసేటప్పుడు యేమీ మాట్లాడలేదు. గోవిందరామ్ బాబాయ్ విషయం పదిహేనేళ్ళ అమాయకపు లక్ష్మి గ్రహించుకోలేకపోయింది. కనీసం యేమయివుంటుందని వూహించుకోలేకపోయింది. తనకూ తల్లి, తండ్రీ సర్వస్వమూ బాబాయేనని మాత్రం తెలుసు. బాబాయ్‌ని చూస్తే అమిత ఆపేక్షగా వుంటుంది.

చిన్నప్పుడు నాన్నా నాన్నా అని దగ్గరకు వచ్చేది. దగ్గరకు తీసుకుని కౌగలించుకునేవాడు. అమ్మాయీ నేనుకాదు మీనాన్నను. నేను బాబాయ్‌ని, అనేవాడు.

నాన్నయేడి బాబాయ్ అంటే కళ్ళనీళ్లుపెట్టుకుని నీకు తెలియదమ్మా అనేవాడు. లక్ష్మి వూరికే యేడవటం మొదలుపెట్టేది.

చిన్నప్పుడు బాబాయ్‌గా జ్ఞాపకంవున్న విషయాలన్నీ నెమరువేస్తున్నది. తనని చిన్నప్పటినుండీ అరచేతుల్లో పెట్టిపెంచాడు. గోవిందరామ్‌బాబాయ్. అటువంటి బాబాయ్ మనసుకు కష్టంకల్గింది. నేను పుష్కరానికి వెళ్దాం రమ్మంటున్నానని యేమన్నా కష్టంకలిగిందేమో అని అనుకుంది.

వసారాలో మంచం వేసుకుని పడుకున్నాడు గోవిందరామశాస్త్రి, దగ్గరకువచ్చి లక్ష్మి కూచుంది.

'ఏం బాబాయ్ అట్లావున్నావు యివ్వాళ చెప్పవూ ?' అంది లక్ష్మి. గోవిందబాబాయ్‌కి దగ్గ తెరవచ్చింది.

'మీఅమ్మ సంగతి జ్ఞాపకంవచ్చింది లక్ష్మీ.' అన్నాడు.

లక్ష్మికి ఆదుర్దా యెక్కువైంది. తన నోటి మీదుగా తల్లిని గురించిన వివరాలు అడగటానికి వెనకంజవేసేది లక్ష్మి. అడగాలని కుతూహలపడేది ఒక్కొక్కప్పుడు. చెప్తే తననోటిమీదిగానే విందామని లక్ష్మి అనుకున్నది.

అమ్మమాత్రం చచ్చిపోలేదనే విషయం లక్ష్మికి తెలుసు. ఆతరువాత వివరాలేమీ తెలియవు. అమ్మ తనకగపడక దాదాపు పన్నెండేళ్లు దాటిపోయినయి.

అమ్మ యెక్కడుందో నాకు చెప్పవేం బాబాయ్, యేదో వూరువెళ్ళిందన్నావ్. ఆ సంగతి చెప్పవూ...ఇవ్వాళ.

'మీ అన్నయ్యకు క్షయ జబ్బువచ్చి పోయినాడప్పుడు నీకు తెలుసుగా' అన్నాడుబాబాయ్ రుద్ధకంఠంతో.

'తెలీకేం బాబాయ్ మొన్న పండక్కి అన్నయ్యను గురించి చెప్పావుగా జ్ఞాపకంవుంది' అన్నది లక్ష్మి.

'ఆతరువాత అమ్మకు కష్టాలు విపరీతంగా వచ్చినయి. మీనాన్న పోయినప్పటినుంచే మరీ కృంగికృశించిపోయేది. మరిరెండేళ్ళకు ఆకాస్త చెట్టూ విరిగి—బావురుమని యేడవటం మొదలుపెట్టాడు బాబాయ్.

లక్ష్మి దగ్గరగా వదిగి కూర్చున్నది.

కొంచెంసేపు యిద్దరూ యేమీ మాట్లాడలేదు.

మళ్ళీ మొదలుపెట్టాడు:—

'అన్నం నీళ్లూ లేక వుపోష్యాలుచేసేది అమ్మ. అమ్మనుచూస్తుంటే నా కూరికే జాలివేసేది. నెత్తిన పిడుగు పడ్డట్టయింది పాపం...'

# "వెంబూశా"

లక్ష్మి కంటతడిపెడ్తోంది.

అమ్మా యేడవకు...మీఅమ్మ యెంత మంచిదనుకున్నావ్...అంటూ తన ధోవతితో ఆమె కంటి నీరును తుడుస్తున్నాడు.

'ఆతరువాత ఆవిడకి యీ బ్రతుకుమీదే విరక్తి కలిగింది. జపాలూ తపాలు...కృష్ణా రామా అనుకుంటూ యేకాకిగా యెవ్వరితోనూ మాట్లాడకుండా కూచుండేది. కొన్నాళ్లకు ఆవిధంగా మనసు మారింది. భారతభాగవతాలు చదివింది. ఎప్పుడు చూసినా దిగులుగా వుండేది. నేను పిలిచి చెప్పేవాణ్ణి రామలక్ష్మమ్మా...అయిందేదో అయిపోయింది, ఎన్నాళ్ళు దిగులుపడి కృశింపచేసుకుంటావ్ శరీరాన్ని అని. నీకు తెలియదు గోవిందూ...ఈ కష్టాలు ఆజన్మాంతమూ వుండేవే మనకు, అనేది.

కొన్నాళ్ళు పురాణాలు వినేది.

భగవద్గీత పారాయణ చేసింది.

మీ అమ్మను చూచినప్పుడల్లా నాకు జాలివేసేది. పాపం...చాలా రోజులు యేకాంతంగా కూచుండేది.

ఉన్నట్టుండి ఒకరోజున తెల్లవారిచూస్తే రామలక్ష్మమ్మ కనపడలేదు. ఆరోజునుంచి యీ రోజు వరకూ ఆమెకనపడ్తే ఒట్టు...అని చెప్తున్నాడు.

'ఎక్కడికివెళ్ళింది బాబాయ్' అంటూ కుతూహలంగా అనటం మొదలుపెట్టింది. దిగులుచెందిన మనస్సుతో.

'నాలుగు రోజులవరకూ యేమీ తెలిసింది కాదు.

ఊళ్ళో యెవరో అనుకుంటున్నారు—ఆవూరు యెవరో సాధువు (స్వాములవారు) వచ్చాడని,

ఆయన వెళ్ళో వెళ్ళో యెవరికో కొంతమందికి వుపదేశం చేసాడనీ, తను తిరిగివెళ్ళేటప్పుడు యిద్దరిముగ్గురిని తీసుకువెళ్ళాడని చెప్పుకున్నారు. బహుశ యేదన్నా యాత్రలకు వెళ్ళారేమో...' అని ముగించాడు.

తనఅమ్మ యిటువంటిపని యెందుకు చేసిందా అని అనేకవిధాలుగా అనుకున్నది లక్ష్మి.

'ఇంకా యెట్లా కన్పడుతుంది మనకు, బాబాయ్ యిప్పటికప్పుడే పన్నెండేళ్ళయిందంటున్నావ్' పసిపిల్లలు అడిగినట్లు అడిగింది లక్ష్మి.

గోవిందబాబాయ్ యేమీ మాట్లాడలేదు.

లక్ష్మి తరువాత ప్రశ్నలేమీ అడగలేదు. గోవిందబాబాయ్ పడుకుంటే విసురుతూ కూచుంది లక్ష్మి—

తెల్లవారింది. తన యింటికి చుట్టుపక్కనున్నవాళ్ళందరూ పుష్కరానికి వెళ్ళారని తెలిసింది. తనూ వెళ్ళి ఆ సంబరం చూద్దామనుకుంది. చాలా దూరాభారంనుండి కూడా వస్తారుట అది చూడటానికి అని యెవరోచెప్పారు. అంతకు ముందరరోజు సంఘటనగురించి ఆలోచించింది. ఆ విషయమై బాబాయ్‌ని అడగకూడదనుకుంది.

బాబాయ్ మామూలుగా భోజనానికి వచ్చాడు. భోజనంచేస్తుంటే లక్ష్మి ఆవిషయం అసలే హెచ్చరించలేదు.

గోవిందబాబాయ్ మజ్జిగపోసుకుని భోజనం అంతా అయింతరువాత—లక్ష్మి అని పిలిచాడు.

వక్కపొడి తెస్తున్నానుండు బాబాయ్ అని ఆకులూ, సున్నం తెచ్చిపెట్టింది పళ్లెంలో.

తమలపాకులు వేసుకుంటూ—

'లక్ష్మి పుష్కరంమాట యేంచేశావ్' అన్నాడు.

'చేసేదేముంది వెళ్దామంటే వెళ్దాం నీయిష్టం' అన్నది లక్ష్మి—

'అమ్మాయి యెప్పుడు పోదాం' అన్నాడు.

'నీయిష్టం అంగ' లక్ష్మి.

గోవిందబాబాయ్ చిరునవ్వునవ్వాడు.

గోవిందబాబాయ్ మనస్తత్వం చాలా విచిత్రంగా వుంటుంది. ఒకప్పుడు ఒకవిధంగా వుంటాడు. ఒకప్పుడు యెప్పుడూ నవ్వుతూ మాట్లాడుతాడు. నిన్న లక్ష్మికి తల్లివిషయం జ్ఞాపకానికి వచ్చి ఆవిధంగా వున్నాడు. తన అమ్మను గురించి పూర్తివివరం తెలుసుకున్నప్పటినుండీ లక్ష్మికి కష్టంగానేవుంది. తను అన్నం తింటున్నప్పుడు అమ్మను గురించి ఆలోచించింది. అమ్మా అనిపిలిస్తే యెంత బావుంటుంది అనుకుంది అంట్లుతోముకుంటూ—

* * *

చాలా కష్టంమీద టిక్కట్లు సంపాయించకల్గాడు గోవిందరామశాస్త్రి. రైళ్ళుపట్టకుండా వస్తున్నారు విపరీతమైనప్రజ. అద్యంతాలు లేకుండా వుంది. ఈ వచ్చేజనం, యెక్కడెక్కడనుండి వస్తున్నారో!

ఊళ్ళో దిగింతరువాత అన్నివింతలూ చూపించాడు లక్ష్మికి. ఎగ్జిబిషన్‌లో స్వస్తిక్ గాజులు కొనుక్కుంది లక్ష్మి. ఇవి బావున్నయ్యా బాబాయ్ అని అడిగింది. బాబాయ్ చిరునవ్వునవ్వి యింకో జత తీసుకో తల్లీ అన్నాడు. ఎగ్జిబిషన్‌లో యింకా వింతవింత వస్తువుల్ని చూసింది. గోవిందబాబాయ్ నాలుగుగజాల ఖద్దరుగుడ్డ కొన్నాడు. లక్ష్మికి ఆగుడ్డ చూపిస్తూ, అమ్మాయీ చూడు, యీ గుడ్డ యెంత సన్నగా నేశారో. చాలా నగిషీగా వుంది అన్నాడు. బలేబావుంది బాబాయ్ అన్నది లక్ష్మి.

ఊళ్ళో అటుతిరిగి యిటుతిరిగి రెండు గంటల తరువాత నదీప్రాంతంలోకి చేరుకున్నారు. జనం యిసకవేస్తే రాలకుండా వున్నారు. వస్తున్నారు, పోతున్నారు. ఉప్పొంగుతూవస్తున్న కృష్ణ రండి, రండి అని ఆహ్వానిస్తున్నది. స్నానాలు చేస్తున్నారు.

ఇవన్నీ చూసి లక్ష్మి యిక్కడ యెంతో బావుంది బాబాయ్ అన్నది. లక్ష్మి మనం కొంచెంసేపుండి స్నానంచేద్దాం అన్నాడు గోవిందబాబాయ్. కొందరు సతీసమేతంగా కొంగులు ముడివేసుకుని వచ్చి కృష్ణలో మునుగుతున్నారు. కిలకిలా నవ్వింది లక్ష్మి.

ఎవరో పుష్కరమహాత్మ్యాన్నిగురించి మాట్లాడుతున్నారు పుష్కరాని గంగలో ఒకసారి స్నానం చేస్తే పుణ్యంవస్తుంది, నర్మదను చూస్తే వస్తుంది. కృష్ణను తలుచుకుంటేనే పుణ్యంవస్తుంది. అది 'కృష్ణ' మహాత్మ్యం అని యెవరో అంటున్నారు.

హాహాకారాలు యెక్కువయినాయి. అంతా గోలగావుంది. కొంతమంది బ్రాహ్మణులు మంత్రాలు చదువుతున్నారు.

గోవిందరామశాస్త్రి కృష్ణలో స్నానంచేశాడు చాలాసేపు. లక్ష్మి ఒకటి రెండుసార్లు మునిగి తరువాత స్నానంచేసింది. తనకేదో పుణ్యం వచ్చినట్లు చాలా హాయిగా వున్నట్లు భావించుకున్నది లక్ష్మి—

ఇంక అటువైపుకి పోదాం రా లక్ష్మి అని తీసుకవెళ్ళాడు. స్నానంచేసి అదంతా ఒకసారి తిరిగివచ్చారు. ఇసుకలో నడుస్తుంటే చాలా బావుంది యిద్దరికీ.

ఊళ్ళో కలరా వుందని పుకారుగా వుంది. జాగ్రత్తగావుండండి, చిరుతిండి యేమీతినబోకండీ అని యెవరో చెప్తున్నారు. ఎవరికో? లక్ష్మికి కలరా అనేమాట వినేటప్పటికే భయంవేసింది. త్వరగా యింటికిపోదామ్ బాబాయ్ అంది. అట్లాగేనమ్మా అన్నాడు.

ఇంకొంచెందూరం వచ్చారు.

ఎవరో గుంపులుకూడి వున్నారు.

మధ్యలో ఒకాయన యేదో చెప్తున్నాడు.

ఆయన కాశీనుండి వచ్చార్ట. మహానుభావులు ...ఆయన చూడండీ వుపదేశాలు చేస్తున్నాడు వినండీ...వినండీ...అని అన్నారెవరో గోవిందరామశాస్త్రితో.

దగ్గరకువెళ్ళి వింటున్నాడు.

గీతలో ఆ కృష్ణపరమాత్మ యేమన్నాడంటే ...అని యేవో కర్మను గురించి, కర్మ పరిపక్వమనీ, ఆత్మపరిశోధన అనీ చెప్తున్నాడు ఆ సాధువు. శ్రద్ధగా వింటున్నాడు గోవిందరామశాస్త్రి, ప్రక్కనే లక్ష్మి వుంది.

సాధువుపక్కనే యెవరో యిద్దరు పూర్వ సువాసినులు గీతాపారాయణ చేసుకుంటున్నారు. కళ్ళుమూస్తూ తెరుస్తూ జపమాలను త్రిప్పుతున్నారు.

ఒకావిడవైపు యింకోసారి చూశాడు గోవిందరామశాస్త్రి.

ఇంకోసారి చూశాడు!

ఇంకోసారి చూశాడు!!

లక్ష్మి అని పిల్చాడు. ఆవిడవైపు చూడు, ఒక్కసారి చూసింది.

లక్ష్మికి యేమీ అర్థంకాలేదు.

గోవిందబాబాయ్ ఆ మనుష్యుల్లోకి తోసుకుంటూవచ్చి ఆవిడదగ్గరకు ... రామలక్ష్మమ్మా ... అని పెద్దగా కేకపెట్టి యెన్నాళ్ళకు కనపడ్డావమ్మా నీయిల్లు బంగారంగానూ అన్నాడు. అందరూ విస్తుపోయి చూస్తున్నారు.

'కాశీలో వుంటున్నాను. పుష్కరానికని బయలుదేరి వచ్చాం'...అన్నది ముక్తసరిగా రామలక్ష్మమ్మ.

లక్ష్మి అమ్మని కౌగలించుకుని యేడుస్తున్నది.